# చీటీ చిక్కింది

రచయిత:

దేవరపల్లి వెంకటకృష్ణా రెడ్డి

ఈమధ్య రంగారావు ప్రేమతత్వం కనుక్కోవాలని 'సెక్సు' పుస్తకాలు అంతులేకుండా కొని చదువుతున్నాడు. ఏశాస్త్రానికైనా అనుభవజ్ఞానము లేనిది, 'డిగ్రీ' పొంది ప్రయోజనము లేదుగదా! పాపము? ఈకల్లేట్లుపడ్డ వాడు కాడు. కాన, పాపభీతిచేతనో, పదిమందిలో నగుబాట్లనో కాలము గడుపుచున్నాడు.

ఒకనాడు కాగినపాలు చల్లారినట్లు కాచే రాదువెన్నెట్లో పండుకొన్నాడు. నిద్రబోవ లెనని ఎంత ప్రయత్నించినా కూర్కుపట్టలే.

ఇతని పతనానికి ఊరేగింపు జరుగుతుందన్నట్లు గాడిదెలు శంఖములు పూరించుచు పాటనెత్తుచున్నవి. అపుడపుడు మూకను సర్దుతున్న దొర కఱ్ఱదెబ్బలవలె 'పెళీపెళీ'మని శబ్దమగుచున్నది. ఈ కూతలు, ఈ తన్నులు, మంచముమీద సాముచేయు రావుకు సంపూర్ణముగా నిద్రాభంగము కలిగించినవి. 'ఏమి శీపాడు' అని ఒళ్లు విరుచుకుంటూ లేచాడు. కండువా పైనవేసుకొని చెప్పులులేకుండానే బయలుదేరాడు. నిద్రబట్టనివారు పచారు చేస్తే, కునికిపాట్లకు సిద్ధమవుతారుగదా? అనుకున్నట్లో పండువెన్నెలాయె.

ఆయన ఒకరింటికిగాని, ఒక తోటకుగాని మరెచ్చటికిగాని పోలేదు. బజార్లలో తిరుగుచున్నాడు. ఇంతలో, ఊరికాపర్లు వీథి మలుపుల్లో ఈలవేశారు. ఏఉద్దేశములేని రంగారావు ఖంగారుపడి, వీథితడిక తీసియున్న ఒక యింటి పంచలోకి వేగంగా పోయినాడు.

ఆ ఇంటామె తలుపు తెరిచి!

'ఏమింతాలస్యము? తీరిక దొరకలేదా? లోపలికి దయచేయండి' అంటూ తన ప్రేమను చూపుతూ, రావుభుజానికి తనభుజము ఆనిస్తూ లోపలికి కొనిపోయింది. పైకెగిరిపోతున్న ప్రాణాన్ని ఓగబట్టుకొని, బాహుపంజరమున పిట్టయి పోయినాడు. దీపము వెలుతురున భోగము కామి రావునుచూచి, తెల్లబోయి దూరముగా పోయింది. కాని, తెప్పరిల్లి చిరునగవుతో: 'రంగారావు బాబుగారు వేళగాని వేళ దయచేసారే' అంటూ సమీపించి 'కుర్చీమీద కూర్చోండి' అని చేయిపట్టుకొన్నది. రంగారావు కుర్చీమీద కూర్చుంటూ 'ఏమీ లేదు. ఊరికాపర్లు సరిగా గస్తు తిరుగుచున్నారో, లేదో, కనుక్కుందామని వచ్చాను. ఇంతలో వాళ్లు సమీపించారు. నేను వాళ్ళను పరీక్షిస్తున్నట్లు తెలియకూడదని మీపంచలోకి వచ్చాను' అన్నాడు కంపంతో. 'మీరు గూడ కావలివాండ్లను చూస్తే భయమా ఏం?' అంటూ సోళనగా నవ్వింది.

'నేను చెప్పలే' అని గాంభీర్యం ప్రకటించేడు. పక్కనవరిస్తున్న కామి 'ఎందుకొచ్చిన మాటలులెండి' అంటూ సమీపించి రావు మోము తేరిపారజూచింది.

'నామాటమీద విశ్వాసములేదూ' అంటూ కండువాసవరించి లేచుటకు ప్రయత్నిం స్తున్నాడు. 'ఎంతమాట : ఎంతమాట ! సరసానికన్నాను లెండి.' అని సమీపించి నిలబడినవాణ్ణి మంచంప్రక్కన కుర్చీమీద ఉన్న తమలపాకుల పళ్ళెముతీసి కూర్చోబెట్టింది. పాపము ! ఆతనికి ఏమిచేయుటకు, ఏమి మాట్లాడుటకు తోచలేదు. ఇంతలో మంచము అనుకొని, దిండుమీద చెయిమోపి వయ్యారంగా చూస్తున్న కామి, రావు చెంపమీద ముద్దు లెంపకాయ వేసి 'నేనందగత్తెనేనా !' అంటూ రావు షర్టుజేబులో చెయ్యివేసింది.

'ఏమి జేబు తడువుచున్నావు' అంటూ తన జేబుమీద చెయ్యివేసి, అసహ్యముతో 'డబ్బులేదులే' అన్నాడు.

'మీడబ్బుకోసముకాదు లేండి' అంటూ కోపముతో చెయ్యి లాక్కొని, 'మా దొడ్డి ఆక్రమణకు యెంతపన్ను కట్టాలో చూద్దాము' అని అంటూ, తీసినచీటి ప్రక్కగా పెంచుకొని చదువుచున్నది.

'ఆక్రమణలో కరణం-తడికెలుతీయలేదు- అని షరా వ్రాస్తే, నేను- సర్దిపెట్టుకొంటా మన్నారు. కాన, తక్కువపన్ను వేయమని శిఫార్సువ్రాశా' అని చూపులలో గొప్పతనం చూపాడు.

'కాపుగారికి మామీద యెంతదయ' అంటూ రావు క్రాపుసవరించుచూ, ముసిముసి నవ్వుతో 'మీకూ పాండిత్య మబ్బిందే' అన్నది.

'ఏమిటి, నేను శిఫార్సు చేసింది అబద్ధమని కరణము చెప్పాడా ?' అని ఈర్ష్యగా చూస్తూ .....

కామి నవ్వుతూ 'అదికాదండి, ఈచీటీ చిత్తగించండి. సానులు పనికిరారని అత్తింటి కోడళ్ళను పట్టారే? ఉండండి, పుట్టింటికెళ్ళిన దొరసానిగార్ని రానివ్వండి' అని అసూయగా చూస్తూ బెదిరించింది.

రావు గాబరాగా 'నేనొకమాట చెబతా విను. నామంచి సెబ్బర్లు నీకు కొత్తగాదు. నాకు సిగిరెట్లుకాల్చే దురభ్యాసము కలదు. సిగిరెట్టుపెట్టె, అగ్గిపెట్టె, చేతిగుడ్డ వగైరాలు, జేబులో పెడితే ఒకతట్టు ఎత్తుగా ఉంటుందని.'

కామి నవ్వుతూ 'అర్ధనారీశ్వరుడివలెనా?' అంది. రావు 'ఏమన్నా అనుకో : అగ్గిపుల్లలు, గీచే అట్టముక్క, ఒక కాగితములో వేరువేరుగా చుట్టిపెట్టుకొనే అలవాటు. ఒకనాడు దారినవస్తూ, సిగిరెట్టు కాల్చుకొనుటకు కాగితము విప్పితే, అట్టలేకపోయింది. ఇంతలో దారివెంబడి నలగకొక్కిన నిప్పెట్టె పడివుండింది దాన్ని తీసికొని సిగిరెట్టు కాల్చుకొని, అట్టకొలుకు చింపితె దానిలో ఈచీటీ ఉన్నది. అక్షరాలనుబట్టికాని, జాబునుబట్టి కాని ఎవరు ఎవరికివ్రాసింరో తెలియకపోతే జేబులోవేసి ఉంటాను.' అని నిష్కపటంగా నవ్వాడు.

'అందుకేనండి, మీకూ పాండిత్యమబ్బిందని నేనన్నది' అంటూ వచ్చి కుర్చీచేతిమీద కూర్చొని 'ఆపెట్టెక్కడ చిక్కిందో ? నేను చెప్పేదా?' అంటూ కుర్చీ చేతిమీదనుంచి లేచి, ఎదుటికొచ్చి, రెండుచెక్కిళ్ళమీద రెండు చేతులువేసి, చూపుల్లో చూపులు కలిపింది

'దారిప్రక్కన అని నేను చెప్పలే?' అని తల ప్రక్కకు త్రిప్పాడు.

'అదికాదండి ఎవరింటివద్ద' అని ఒయ్యారంగా చూచింది.

'మంచినీళ్ళభావి ప్రక్కన. ఎవరైతే మనకేమి? ఈజాబు వ్రాసిన ఆమెకు పుట్టుకతో కవితావేశముకలదు. కాని, ఏమూడవతరగతిలోనో బడికి స్వస్తిచెప్పింది ఏదిచీటి?' అం

టూ చెయిచాచినాడు.

'ఆమె పేరు తెలియంది మీకివన్నీ యెట్లు తెలుసు' అని జయసూచకంగా నవ్వింది.

'నవ్వి ప్రయోజనములేదు. జాబుచూడు :

'మీ అత్తసంగతి తెలుసుకద'

'కంఠోపాఠము చేసినట్లున్నారే' అనినవ్వుతూ, చీటీచూస్తూ. 'పూర్తి చెయ్యండి' అన్నది.

'—ఇపనిచేయించటం దరముకదు. నా మీద దయఉంచవలసింది.—అని చీటీలో ఉన్నది కదూ ? ఇప్పుడు బోధపడిందా ?'

'ఆ, ఆ. ఇందాకనే బోధపడింది.' అని నవ్వుతూ తలఆడించింది.

'ఏం, తెలిసింది?' అని విసుగుతో అన్నాడు.

'కవిత్వం నాకు బోధపడలేదు. కాని, మా అత్త గయ్యాళి. ఆమెకు తెలిస్తే మాట వస్తుంది. మీరిట్లు అల్లరిఅగ్యేటట్లు చెప్పంపటం న్యాయమూ? నామీద దయయుంచి అల్లరికానిమార్గం ఆలోచించు' అని వ్రాసి ఉంటుంది. బోధపడ్డదా? ఒంటరిగా మంచి నీళ్ళబావివద్ద మిమ్ములను సొంతముగా మాట్లాడమని' నవ్వుతూ 'పోతారా? అయినా, ఆమె కవిత్వం ఏమిటో అదీచెప్పిపొండి' అని మంచంమీద కూర్చొని వంగి చూస్తూఉన్నది.

'ఆమె అత్త యెంతపవిత్రురాలో. ఆమె వద్ద తానెట్లు ప్రవర్తించాలో తెలుపుటయే గాక, పవిత్రాపవిత్రముల నెరుగక పిచ్చి పనులు చేయవచ్చునా? కావున, నామీద సోదరీభావముంచవలసినది. అని ఉద్బోధించినట్లు నాకు కాన్పించుచున్నది.' అని అంటూ ఉండగా......

'ప్రియురాలిజాబులో పురాణసీతులు భావించకూడదు. వన్నెలు చిన్నెలు చూడాలి. కాన నేనుచెప్పిన అర్థమే బలవత్తరమైనది. ఇదేనా కవిత్వపుపస?' అని హేళనగానవ్వింది.

'ఒకరి కొకవిధముగా, మరియొకరి కొకవిధముగా, వారివారి తత్వముల ననుసరించి తోచునట్లు వ్రాయుటే, కవిత్వ పరమావధి. కాబట్టి కవితావేశము కలదనియు, అక్షరలోపమునుబట్టి మూడవతరగతి అనియు ఊహించితిని. ఈమన మనహిందూబాలికల చదువు ఆగిపోవుటచే, ఎందరో కవయిత్రులుగాకుండా పోవుటయేగాక, నీవుచెప్పిన అభిప్రాయప్రకారమే ఈచీటి వ్రాసియుండిన, వారి అక్షర జ్ఞానము యెట్లు దుర్వినియోగము చేయుచున్నారో ఊహించు......' అంటూ మొఖమున చెమటబిందువులు చేతిరుమాలతో తుడుచుకొన్నాడు.

'ఊహించడానికేముంది ? పరాయివానికి జాబువ్రాయడమే ఆధారం. మీరుచెప్పినట్లు తనకిష్టములేకపోయిన జాబువ్రాయవలసిన అంతపనియేమి వచ్చింది. మీరే ఊహించండి' అంటూ నవ్వింది.

'కవిత్వంలో ప్రస్తుతార్థముగాక కథా సంబంధములేని మరియొక భావముతోచిన దానినే 'ధ్వని' అంటారు. 'నాచీటీ నాకివ్వు. పోవాలె' అని చెయిచాపినాడు.

'ఓడినా పైచెయ్యి నాదేనన్నారు. కనుకనే మీకూ పాండిత్య మబ్బిందని, ఇందాకనే చెప్పాను' అంటూ తనఅర్థమును రావు అంగీకరించాడని పకాపక విరుగబడి నవ్వింది.

'పోయివస్తాను'అని లేచి 'చీటియివ్వు'అని చెయిచాపినాడు.

'మరల దర్శనమెపుడు' అని కందువాపట్టుకొన్నది.

'ఎప్పుడో చెప్పలేను' అంటూ కందువా

సవరించుచూ ‘చీటియివ్వు’ అన్నాడు.

‘చెప్పంది పోనివ్వను’ అని యెదురువచ్చి నిలబడినది.

‘పదో తారీఖున వస్తాను. చీటీయివ్వ పోవాలె’ అని చేయిపట్టుకొన్నాడు.

‘29, 30, 31 అబ్బ! 1, 2, 3, 4... ఎన్నినాళ్లు 9, 10’ అని దీనంగా చూస్తూ రొమ్ముమీద తలఆనించింది.

‘ఎవరన్నా చూస్తారు......నేను ఊళ్లో ఉండను. చీటీయివ్వు’ అని చెయి చాపాడు.

‘ప్రియురాలిని వెతుకుతారు కాబోలు’ అని ఈర్ష్యగా నవ్వింది.

‘నిజముచెబితే నమ్మవు. నేనేమి చేయాలి? నిద్రవస్తూంది పోవాలె. చీటి...’

‘ఈమంచంమీద నిద్రపోండి’ అని చెయి పట్టి లాగింది.

‘వద్దు, వద్దు, ఇంటికిపోవాలె. చీటి...’

‘ఎప్పుడొస్తారు?’అని ఆమె రావుచొక్కాగుండి తిప్పుచు అన్నది.

‘ఇంతకుముందు చెప్పలె!’ అని తొలిగి పోబోయినాడు.

‘మీరు మళ్ళీవచ్చినప్పుడు ఈచీటీ ఇస్తాను.’ అంటూ పోయి మంచముమీద కూర్చున్నది. రావు వెనుతిరిగి మంచముదగ్గరకువచ్చి మెల్లగా ‘పంచలోకి ఎవరో వచ్చిపోతున్నట్లు చప్పుడు అయింది’ అన్నాడు.

‘ఊరికావలివాళ్లు అప్పుడపుడు వచ్చిపోతుంటారు. నేను చూచివస్తాను. ఉండండి’అని రంగారావును నిలిపి, గడియతీసి వీధిలోకి పోయివచ్చి, ‘ఎవరులేరు, ఊరికనే భ్రమపడ్డాము’ అని తెచ్చుకోలు నవ్వునవ్వింది.

రంగారావుకు ఇద్దరు గుసగుసలాడిన శబ్దం వినబడ్డది. కాని ‘ఎవరులేరు’ అని నవ్వుతుందేమని ఆలోచిస్తూ, చుట్టుప్రక్కల చూచి, రావు పిల్లివలె బయటపడ్డాడు.

# చిత్రము

చిత్రములకెల్ల చిత్ర మో శేషశయన !
తావకపదాబ్జములు నిరతమ్ము నాదు
హృదయకమలాకరమున నహీనకాంతి
పుంజముల వెదజల్లునే సంజలేక ;
ఎప్పుడో మున్ను సురలెల్ల మువ్పుదప్పి
నమృతముంద్రావి సంతృప్తినందిరంట
యెల్లవేళల నిపుడు నాహృదయపాత్ర
నీదు నామామృతమ్ముచే నింపిత్రావు
చుండియును నేను సంతృప్తినొందలేదు ;

పల్లవింపక నైరాశ్యవహ్నిలోన
వాడి రూపరిపోయిన భావలతలు
తావకారుణపదవసంతమ్ముసోక
చివురులందొడ్డి విరులపుష్పించదొడగె ;
చిరుతప్రాయాన నాప్రేమ జీవలతకు
కరకు తెవు లొండు ప్రాపించె, గాని నేడు
వయసుముదిరినకొలది నాపంచప్రాణ
ములు తెవుళ్ళకు తెవులయ్యె; భూతనాథ !

* * *

ఓపరాత్పర! నీవు నీయున్నరూపు
దాచి మాబోంట్ల నేల చింతాసముద్ర
మందుద్రోచెదు ; సాధించి డెందములనె
చూడజాలమొ నిన్ను మాచూపులలర.

—ములుమూడి ఆదిశేషాద్రి రెడ్డి.